క్లుప్తంగా

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద సోమవారం గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు కూడా భారీఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

బాధిత కుటుంబాలకు జక్కంపూడి రాజా పరామర్శ



రాపాకలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కోరుకొండ, సీతానగరం మండలాలలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. రాపాకలో ఘంటా రాజు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను, కోరుకొండ మండలం నరసాపురంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అడబాల చినబాబు మావయ్య మారిశెట్టి తాతారావు మృతి చెందగా, వారిని పరామర్శించారు. మారిశెట్టి వెంకట స్వామి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైల్వే వెండర్ నిజాయితీ



యజమానికి పర్సు అప్పగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే స్టేషన్ ఆహార పదార్థాలను విక్రయించే ఓ వెండర్ తనకు దొరికిన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న పర్సు (పౌచ్)ను దాని యజమానులకు అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన రైల్వే స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆదివారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుండగా గుర్తు తెలియని వ్యక్తి నుంచి జారిపడిన పౌచ్‌ను వెండర్ ఎస్. వెంకటరమణ గమనించాడు. వెంటనే దాన్ని జీఆర్పీ స్టేషన్‌కు అందించాడు. దానిలోని చిరునామా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన కె.అనురాధకు చెందినదిగా గుర్తించారు. ఆమె శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో సింగరాయకొండ నుంచి రాజమహేంద్రవరం వరకూ ప్రయాణం చేసి రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికి వెళ్లిపోయారు. దానిలో 12 గ్రాముల నల్ల పూసల నెక్ చైన్, రూ.4750 ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జీఆర్పీ స్టేషన్‌కు యజమానులను పిలిపించి వారికి పౌచ్‌ను అందించారు. వెండర్ వెంకట రమణ నిజాయితీని మెచ్చుకుని రూ.4750ను యజమానులు బహుమతిగా అందించారు.

నర్సరీ సందర్శన

కడియం: కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని సెంట్రల్ జైలు ఎస్పీ రాహుల్ సోమవారం సందర్శించారు. నర్సరీ అధినేత, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆయన వెంట డీఎస్పీ రాజ్‌కుమార్, అసోసియేషన్ సభ్యుడు గాద నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మం శాశ్వతం

రాజమహేంద్రవరం రూరల్: సనాతన ధర్మం శాశ్వతమైనదని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. కొంతమూరులోని వల్లభ గణపతి ఆలయ సమీపంలోని ప్రవచన మందిరంలో ఆయన కల్కి అవతార వైభవంపై సోమవారం ఐదో రోజు ప్రసంగాన్ని కొనసాగించారు. సనాతన ధర్మం అన్ని వర్ణాల క్షేమం కోసమేనన్నారు. అంతరిక్షంలోని గ్రహాల శాంతి కోసం కూడా సనాతన ధర్మం ప్రభవించిందని తెలిపారు. శ్రవణ మాత్రం చేత పురాణాలు మనకు శుభఫలితాలను ప్రసాదిస్తాయన్నారు. కల్కి చేసిన శివస్తుతికి ప్రసన్నుడయిన పరమేశ్వరుడు అతడికి దివ్యమైన గుర్రాన్ని, సర్వజ్ఞనామం గల చిలుకను, దివ్యమైన ఖడ్గాన్ని ప్రసాదించాడన్నారు. శ్రీరాముడికి కోదండం ఎటువంటిదో, కల్కి దేవునికి ఈ ఖడ్గం అటువంటిదేనన్నారు. కల్కి వేదవిద్యను పరశురాముని వద్ద అభ్యసించాడన్నారు. వేద ధర్మాల రక్షణకే తాను అవతరించానని, వేదవిహిత ధర్మాచరణమే హరికి మనం చేసే సేవ అని కల్కి వివరిస్తాడని సామవేదం అన్నారు. మనం నుదిటి మీద మృత్తిక, (గోపీచందనం), భస్మం, చందనం నిత్యం ధరించాలని, ఈ ధారణ త్రిమూర్త్యాత్మకమైనమైన శక్తికి ప్రతీక అని ఆయన అన్నారు. కాగా.. వల్లభ గణపతి ఆలయంలో జరుగుతున్న నవరాత్ర ఉత్సవాలలో భాగంగా ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామికి లక్ష దూర్వారయుగ్మ పూజ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాతపై కన్నెర్ర

- వరుణుడి ఆగ్రహంతో ముంపు బారిన పొలాలు
- రెండోసారి నాట్లు వేసినా కలసిరాని కాలం
- అన్నదాతల ఆవేదన



బురద కాలువకు గండి పడటంతో రాఘవపురం వద్ద మునిగిపోయిన పొలాలు

మధురపూడి: అన్నదాతపై ప్రకృతి మరోసారి కన్నెర్ర చేసింది. ఖరీఫ్ ప్రారంభంలో వేసిన వరినాట్లు వరుణుడి ఆగ్రహంతో ముంపు బారిన పడి నాశనమయ్యాయి. దీంతో రైతులు రెండోసారి వరినాట్లు వేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అవి కూడా ముంపు బారిన పడ్డాయి. ఆగకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతకు నష్టాన్ని మిగిల్చాయి. కోరుకొండ మండలంలో 2,500 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలు నీట మునిగాయి. బుచ్చెంపేట, గుమ్ములూరు, బూరుగుపూడి, కాపవరం, మునగాల గ్రామాల్లోని రైతులకు ఆవేదన చెందుతున్నారు.

ముంపు బారిన శ్రీరంగపట్నం

కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం గ్రామాన్ని బురద కాలువ సోమవారం ముంచెత్తింది. గ్రామంలోని బీసీ పేటల్లోని పందుళమ్మ, మోదకొండమ్మ ఆలయం సమీపంలోని ప్రాంతం, ఎస్సీపేటలోని లోతట్టు ప్రాంతాల్లోని నీరు చేరింది. సుమారు 60 ఇళ్ల చుట్టూ వరదనీరు చేరింది. స్పందించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ కేఎల్ శివజ్యోతి, తహసీల్దార్ సుస్వాగతం, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, సెక్రటరీ జానా శ్రీను, స్థానిక నాయకులు సహకార చర్యల్లో పాల్గొన్నారు. సూరంపాలెం జలాశయం నుంచి అదనపు జలాలను కిందికి విడిచిపెట్టడమే ఈ ముంపునకు కారణం. అలాగే రాఘవపురం వద్ద కూడా బురద కాలువ గండి కొట్టింది. ఆ గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శ్రీరంగపట్నంలో ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ ప్రశాంతి బాధితుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.



మునగాలలో చెరువును తలపిస్తున్న పొలం



రాపాక వద్ద ముంపులో ఉన్న పొలాలు

రోడ్డుపై వరద ప్రవాహం

సీతానగరం: అధిక వర్షాలతో రాపాక - నల్గొండ రోడ్డు ముంపు బారిన పడింది. సీతానగరం మండలం రాపాక నుంచి కోరుకొండ మండల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సోమవారం రాపాక వెళ్లి ముంపు బారిన పడిన రోడ్డును పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రెండు రోజుల్లో రోడ్డుపై నుంచి నీరు లాగితే యథాతథంగా రాకపోకలకు అనుమతి ఇస్తామని తహసీల్దార్ తెలిపారు.

కొండ గోదావరి ఎగపోటు

సీతానగరం: కొండ గోదావరి ఎగపోటుతో పంటపొలాలు ముంపులోకి చేరుకున్నాయి. ఆగస్టులో ముంపు బారి నుంచి బయటపడిన పొలాల్లో రైతులు రెండోసారి వరినాట్లు వేశారు. ఇప్పుడు మళ్లీ అవి మునిగిపోయాయి. కాగా.. రెండు రోజుల క్రితం గోదావరి వరద రావడంతో బొబ్బిల్లంక స్లూయిజ్ గేట్లు ఆటోమేటిక్‌గా మూసుకుపోయాయి. దీంతో మండలంలో కురిసిన వర్షాలతో పాటు ఇతర మండలాల నుంచి వచ్చిన నీరు, సూరంపాలెం మిగులు జలాలతో కలిసి బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువ మీదుగా స్లూయిజ్ ద్వారా గోదావరిలో కలవాలి. కానీ ఆ మార్గం లేకపోవడంతో వెనక్కి తన్నింది. వంగలపూడి, చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, ఉండేశ్వరపురం, మిర్తిపాడు, కూనవరం తదితర గ్రామాలకు చెందిన నాలుగు వేల ఎకరాలు ముంపులోకి వెళ్లాయి.



శ్రీరంగపట్నం వరద బాధితుల శిబిరంలో ఆహారం అందిస్తున్న అధికారులు



లోతట్టు ప్రాంతాలకు చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న అధికారులు



రాపాక - నల్గొండ రోడ్డుపై నిలిపివేసిన రాకపోకలు

ఉద్ధృతంగా పశ్చిమ ఏలేరు కాలువ



పెదపూడి మండలం ఏపీత్రయం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పశ్చిమ ఏలేరు కాలువ

పెదపూడి: కరకుదురు ఏపీ త్రయం గ్రామాల మధ్యలో ఉన్న పశ్చిమ ఏలేరు కాలువకు వరద ఉధృతి పెరగడంతో పరిసర గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ కింద భాగంలో రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాలు, ఎగువన కరకుదురు గ్రామం ఉంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ ఏలేరు ఉధృతి పెరగడంతో పాటు, వంతెన వద్ద గుర్రపు డెక్క చేరింది. దీంతో కాలువలో నీటి ప్రవాహం దిగువ ప్రాంతాలకు నెమ్మదించింది. ఈ కాలువకు ఒకవైపు నీరు బిక్కవోలు నుంచి జి.మామిడాడ, పెద్దాడ, పెదపూడి, దోమాడ, కరకుదురు గ్రామాల మీదుగా ప్రవహించి, ఏపీ త్రయం వంతెన వద్ద నుంచి కాకినాడ సముద్రంలోకి కలుస్తుంది. అలాగే మరోవైపు సామర్లకోట ఎగువన ఏలేరు కాలువ నుంచి నీరు వచ్చి ఏపీ త్రయం వంతెన వద్ద నుంచి కాకినాడ సముద్రంలో కలుస్తుంది. బిక్కవోలు, సామర్లకోట నుంచి వచ్చే నీరు ఈ వంతెన వద్ద ఒకేచోట కలుస్తుండడంతో, నీరు దిగువ ప్రాంతాలకు తక్కువగా వెళుతూ, పైకి ఎగబాకుతోంది. సామర్లకోట నుంచి వచ్చే వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలువకు సంబంధించి కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం, మేడలైన్ వద్ద కాలువలోకి చెత్త ఎక్కువ వేస్తున్న నేపథ్యంలో కాలువ కుచించుకుపోతూ వెడల్పు తగ్గింది దీంతో ఆ ప్రాంతం నుంచి సముంద్రంలోకి నీటి ప్రవాహం తగ్గిపోయింది. ఈ క్రమంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు మరింత పెరిగితే రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లోకి ప్రవేశిస్తుంది. దీంతో పల్లపు ప్రాంతాలైన రామేశ్వరంలోని ఇందిరమ్మ కాలనీ, ఏపీ త్రయంలో వంతెన వద్ద కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆయా గ్రామాల్లో సుమారు 1,490 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈవరి పంట మొత్తం నీట మునిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో 400 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. అలాగే కరకుదురు గ్రామంలో సుమారు 400 ఎకరాలు నీట మునిగే అవకాశం ఉంది.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

అడిషనల్ డీఎంహెచ్ఓ వసుంధరాదేవి



రంగంపేట పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటుతున్న డాక్టర్ వసుంధరాదేవి

రంగంపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వసుంధరాదేవి అన్నారు. రంగంపేట పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో తమవంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. అనంతరం పీఎంఎస్ఎంఏ కార్యక్రమానికి హాజరైన 36 గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, కె.చిన్నారావు, కె.సంకీర్తన, సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఏఎంలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- పశ్చిమ ఏలేరు వంతెన వద్ద వరద ఉధృతి
- పర్యవేక్షిస్తున్న అధికారుల బృందం
- పంటల సంరక్షణకు వ్యవసాయాధికారుల సూచనలు



ఏపీ త్రయంలో పశ్చిమ ఏలేరు వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెదపూడి: పశ్చిమ ఏలేరు వంతెన వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుగానే అధికారులను అప్రమత్తం చేసి, ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన, అధికారులతో కలిసి మండలంలో కరకుదురు, ఏపీత్రయం గ్రామాల మధ్యలో ఉన్న పశ్చిమ ఏలేరు వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, వరద ఉధృతి పెరిగిఏ రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాలు నీట ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో అధికారులు ఇక్కడ పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. సచివాలయ కార్యదర్శి త్రిపుర, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణ్, వీఆర్వో జి.అంజిబాబు, గ్రామ పశు సంవర్థక శాఖ సహాయకుడు గణేష్, వెంకటలక్ష్మి, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులతో బృందం ఏర్పాటు చేశామన్నారు.

పరిశీలించిన ఎమ్మెల్యే

మండలంలో కరకుదురు, ఏపీత్రయం గ్రామాల మధ్యలో ఉన్న పశ్చిమ ఏలేరు వంతెన వద్ద వరద ఉధృతి, తూడుకాడను అధికారులతో కలిసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఏలేరు కాలువ ఉధృతి పెరిగితే రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాలు, అందులో పొలాలు నీటి ముంపునకు గురవుతాయని ఈ సందర్భంగా రైతులు, స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, ఇరిగేషన్, డ్రెయినేజి అధికారులతో, జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఏలేరు డ్రెయిన్ ఏపీత్రయం వంతెన వద్ద ఉన్న తూడుకాడను తొలగించాలని, మేడలైన్ ప్రాంతం వంతెన వద్ద పూడికను తొలగించాలని కోరారు. లేనిపక్షంలో వరద ఉధృతితో రెండు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, పూడికతీత పనులు చేపట్టి, తూడును తొలగిస్తామని చెప్పినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సీతాపతి, ఇరిగేషన్, డ్రెయినేజి అధికారులు, పలువురు రైతులు, నాయకులు ఉన్నారు.

సస్యరక్షణ తప్పనిసరి

అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాల్లో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాట్ శాస్త్రవేత్త ఎ.సీతారామశర్మ రైతులకు సూచించారు. ఆయనతో పాటు, మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, ఏఈఓ సత్యనారాయణ తదితరులు రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో సోమవారం నీట మునిగిన వరి పొలాలు, వరి దుబ్బులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారామశర్మ మాట్లాడుతూ, వరి పొలాలు గత ఆరు రోజులుగా నీటి ముంపులో ఉన్నాయన్నారు. ఇంకా నీరు బయటకు వెళ్లడానికి రెండు లేదా మూడు రోజుల సమయం పడుతుందన్నారు. పొలాల నుంచి నీరు వెళ్లినప్పుడు, కాండం కొంచెం దృఢంగా ఉంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ ఎరువులను చల్లాలన్నారు. వ్యాధులు, తెగుళ్లు వ్యాపించకుండా లీటర్ నీటికి, గ్రాము కార్బండిజిం లేదా రెండు గ్రాముల కార్బండిజిం మ్యాంకోజెబ్ పిచికారీ చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 18,500 ఎకరాలు వరిసాగు చేస్తుండగా, రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో 400 ఎకరాల్లో వరి నీట మునిగిందన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే ముంపునకు కారణం

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజానగరం: తుపానులు, వరదలు ప్రతి ఏటా వస్తుంటాయి, అయితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, ఏవిధమైన ప్రాణనష్టం జరగకుండా కాపాడ్సాలిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ విషయంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లనే విజయవాడలో ఆస్తి, ప్రాణనష్టం జరగడానికి కారణమైందని విమర్శించారు. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణం, నీటిపారుదల శాఖల నుంచి ప్రభుత్వానికి ముందుగానే రిపోర్టులు వస్తాయని, తదనుగుణంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ చర్యలు తీసుకుంటారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ నష్టానికి దారితీసిందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్‌పైనా, వైఎస్సార్ సీపీపైనా అనేక రకాలుగా ఆరోపణలు, విమర్శలు చేస్తూ పబ్లిసిటీ కోసం ఆరాట పడటమే గానీ, ప్రజల కోసం, రాష్ట్ర ప్రగతి కోసం ఈ ప్రభుత్వం ప్రయత్నించింది లేదన్నారు. ముంపు ప్రాంతాలలో పర్యటించిన సమయంలోనూ ఇదే యావతో సీఎం చంద్రబాబు వ్యవహరించడం శోచనీయమన్నారు. ముంపు ఏరియాలలోని అపార్టుమెంట్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించి ఉంటే ప్రమాద తీవ్రత ఇంతలా ఉండేది కాదన్నారు. సీనియర్‌నంటూ పదే పదే చెప్పుకునే చంద్రబాబు ఈ విషయంలో ముందు చూపు, ఆలోచనతో వ్యవహరించకపోవడం ప్రాణనష్టానికి దారితీసిందన్నారు. ముంపులో చిక్కుకున్న వారిలో 50 మంది వరకు ప్రాణాలు కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నంలో మృత్యువాత పడటం విచారకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులైనా ప్రజలు ఇంకా ముంపు బాధలు పడుతున్నారంటే అది ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనగా పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంలోనే ఇటువంటి పరిస్థితులు సంభవించడం చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు. దీనికి విజన్ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమని జక్కంపూడి రాజా ఆరోపించారు.

తాతారావుకు జాతీయ అవార్డు



రాజానగరం: మండలంలోని కానవరానికి చెందిన కోడి తాతారావును బెంగళూరులోని సోమలరాజు ఫౌండేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. బెంగళూరులో ఈ నెల 14న జరిగే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో ఆయనకు అవార్డును అందజేస్తారు. మన హక్కులకై పోరాడు - సాధించు ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడిగా తాతారావు సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ఇస్తున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు.

బంగారం, నగదు చోరీ

సీతానగరం: రఘుదేవపురంలో ఓ ఇంటిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.70 వేలను ఆదివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన యనమదల శిరీష తన కుమారుడు వీరన్న చౌదరితో అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లారు.

వీరన్న చౌదరి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా తలుపులు తెరచి ఉండటంతో దొంగతనం జరిగిందని గుర్తించి తల్లికి తెలియజేశాడు. వెంటనే ఆమె ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువాలోని ఏడున్నర కాసుల బంగారు గొలుసు, మూడు కాసుల గాజులు, రూ.70 వేలు, రెండు కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

శాటిలైట్‌సిటీలో చిరుత సంచారం అబద్ధం

- తేల్చిచెప్పిన అధికారులు
- అసత్య ప్రచారం చేసిన యువకులకు కౌన్సెలింగ్



బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్



అధికారులతో చర్చిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీలోని రాజీవ్ గృహకల్ప సముదాయం 11వ వీధిలో చిరుత సంచరిస్తోందని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అబద్ధమని అధికారులు తేల్చారు. దీనిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే... చిరుత సంచరించిందనే ప్రచారంపై శాటిలైట్‌సిటీ వాసులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు, పోలీసు అధికారులు అక్కడకు వెళ్లి విచారించగా.. అది అబద్ధమని తేలింది. 11వ వీధిలోని వినాయక మండపం వద్ద నలుగురు యువకులు ఆదివారం రాత్రి అక్కడ ఉన్న ఆటోలో కూర్చున్నారు. సెల్‌ఫోన్‌లో గోడపై ఉన్న చిరుత ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుని, శాటిలైట్‌సిటీ సి బ్లాకులో చిరుత సంచారం చేస్తుందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది వైరల్‌గా మారడంతో జిల్లా ఫారెస్టు అధికారులు, సిబ్బంది, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వోలు అక్కడకు చేరుకుని సదరు యువకులను పిలిచి విచారించారు. అయితే అది సరదాగా పెట్టామని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ యువకులను బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తీసుకుని వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా.. అటవీ ప్రాంతంలోనే పులి ఉన్నట్టు గుర్తించామని, మరి ఏ ఇతర ప్రాంతాలలో సంచరించడం లేదని ఇన్‌చార్జి జిల్లా ఫారెస్టు అధికారి భరణి తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

చిరుతను పట్టుకునేందుకు 9 బృందాలు

రాజమహేంద్రవరం సిటీ: చిరుత పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు 50 మంది సిబ్బందితో 9 బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం గస్తీ కాస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆయన సోమవారం నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిరుత సంచారంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిరుత సంచారంపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలందరూ అటవీశాఖ విడుదల చేసిన వీడియోలు చూసి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ ఏ.త్రిమూర్తులు రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ హెచ్.హేమ శైలజ తదితరులు పాల్గొన్నారు.